## వివాహిత ఆత్మహత్య

ఇంద్రవెల్లి, డిసెంబర్ 7 : పురుగుల మందు తాగి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం ముత్నూర్ గ్రామంలో జరిగింది. కుటుంబీకులు, ఎస్ఐ సునీల్ తెలిపిన కథనం ప్రకారం.. బోథ్ మండలం వజ్జర గ్రామానికి చెందిన కవిత(26)కు, ఇంద్రవెల్లి మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన గేడం జ్యోతిరాంతో 2021లో వివాహం జరిగింది. గురువారం ఉదయం భర్త గేడం జ్యోతిరాం మద్యం తాగి వచ్చి భార్య కవితతో గొడవపడ్డాడు. దీంతో కవిత ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని దవాఖానకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. మృత్యురాలు తండ్రి సిడాం లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

# కంకలమ్మ జాతరకు వేళాయె

- ఈ నెల 10న పారిజాత వనంలో నిర్వహణకు ఏర్పాట్లు
- ఆయా రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలిరానున్న భక్తులు
- కాకతీయుల పాలనకు సాక్ష్యంగా నిలుస్తున్న ఆలయం
- 2008లో దాతల సాయంతో పునర్నిర్మాణం
- భారతదేశంలోనే మహేంద్రుల ఏకైక పుణ్యక్షేత్రం


శ్రీ కంకలమ్మ దేవి

కౌటాల, డిసెంబర్ 7 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీ కంకలమ్మ-కేతేశ్వర ఆలయం కాకతీయుల పాలనకు సాక్ష్యంగా నిలుస్తున్నది. తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక పురాతన ఆలయంగా పేరొందింది. భారతదేశంలోనే మేదరు(మహేంద్రులు)ల ఆరాధ్య దైవంగా ఉన్న ఏకైక ఆలయం ఇది. దేశంలోనే కౌటాల పుణ్య క్షేత్రానికి గొప్ప మహిమలు ఉండడం విశేషం. వందల ఏండ్ల క్రితం డంగుసున్నతంతో భారీ రాతి దిమ్మెలతో దీనిని నిర్మించినట్లు అవగతమవుతున్నది. కౌటాల క్షేత్రములో అక్కడక్కడా పొలాల గట్లపై వినాయకుడు, కుమారస్వామి, నంది, శృంగి, భృంగి, బ్రహ్మ, విష్ణు దేవతల విగ్రహాలు శిథిలావస్థలో కనిపిస్తాయి. ఈ గుట్టపై పెద్ద నీటి కొలను ఉంది. మధ్యయుగంలో ఇక్కడి దేవాలయాలు, విగ్రహాలను ముష్కరులు ధ్వంసం చేసినట్లుగా పూర్వీకులు చెబుతారు.

### ఆలయ పునర్నిర్మాణం

కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన సుల్వ కనకయ్య- కల్యాణి దంపతుల సాయంతో శ్రీ కంకలమ్మ కేతేశ్వర ఆలయ పునర్నిర్మాణం చేపట్టారు. 17-03-2008 సోమవారం రోజున వేదపండితులు మహా గణపతి, నవగ్రహ రుద్రహోమములు నిర్వహించి పనులు ప్రారంభించారు. 13-11-2009న వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కంకలమ్మ దేవి, కేతేశ్వర స్వామి, విఘ్నేశ్వరుడు, ధ్వజ స్తంభములు, నవగ్రహాలు, నాగదేవత విగ్రహాలకు ప్రతిష్ఠాపన చేశారు.

### కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా..

కౌటాల క్షేత్రంలోని గుట్టపై వెలసిన శ్రీ కంకలమ్మ-కేతేశ్వర స్వామిని పూజిస్తే కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. యేటా వ్యవసాయం ప్రారంభానికి ముందు రైతులు గ్రామ దేవతలకు మొక్కులు చెల్లిస్తారు. ఆ తర్వాత పనులు మొదలు పెడుతారు. కార్తీక మాసం చివరి ఆదివారం పెద్ద ఎత్తున జాతర నిర్వహిస్తారు. పవిత్ర పెన్‌గంగ, ప్రాణహిత నదుల్లో కార్తీక స్నానం ఆచరించడం వల్ల సకల పాపములు నశిస్తాయని పండితులు చెబుతారు. పారిజాత వనంలో కొలువైనా స్వయంభూ శ్రీ కేతేశ్వర- కంకలమ్మ జాతర ఈ నెల 10వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ ప్రాంతం నుంచేగాకుండా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తుంటారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, కుటుంబ సభ్యులందరూ ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రత్యేక పూజలు చేస్తారు. అమ్మవారికి పూజలు చేసి ఇంటికి చేరేలోగా తప్పనిసరిగా వర్షం కురుస్తుందని భక్తులు చెబుతుంటారు.


ధ్వజారోహణ చేస్తున్న తులసీ రామేశ్వర్ స్వామి, భక్తులు

### ఇలా వెళ్లాలి..

కౌటాల మండల కేంద్రంలోని కంకలమ్మ ఆలయానికి చేరుకునేందుకు కాగజ్‌నగర్ నుంచి కౌటాలకు ప్రత్యేక బస్సులు, ఆటోలు అందుబాటులో ఉంటాయి. సిర్పూర్(టీ) వరకు రైల్వే మార్గం కూడా ఉంది. కాగజ్‌నగర్ నుంచి 40 కిలో మీటర్లు, సిర్పూర్(టీ) నుంచి 20 కిలో మీటర్ల ఉంటుంది. మండల కేంద్రానికి 6 కిలో మీటర్ల దూరంలో పెన్‌గంగ, 13 కిలోమీటర్ల దూరంలో ప్రాణహిత నదులు నిత్య జీవధారగా ప్రవహిస్తున్నాయి.

### ఉత్సవాలు ప్రారంభం

శ్రీ కేతేశ్వర- కంకలమ్మ ఆలయ జాతర మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్, వ్యవస్థాపకుడు సుల్వ కనకయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. గురువారం ఉదయం ధ్వజారోహణ, ఆలయ కాల సూచికను విడుదల చేశారు. ఈ కార్యక్రమాల్లో మహారాష్ట్ర దాబా కొండయ్య మహారాజ్ ఆశ్రమ స్వామీజీ శ్రీ తులసీ రామేశ్వర్ పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రతి రోజూ ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులున్నారు.

# కిక్కే.. కిక్కు..

- ఎన్నికల్లో ఏరులైన మద్యం
- రెండు నెలల్లోనే రూ.75.28 కోట్ల అమ్మకాలు
- ప్రతిరోజు సగటున రూ.1.25 కోట్ల మద్యం తాగేశారు
- జిల్లా వ్యాప్తంగా రూ.3.32 కోట్ల మద్యం పట్టివేత
- జోరుగా మాంసం విక్రయాలు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 7 : ఇటీవల జరిగిన అంసెంబ్లీ ఎన్నికల్లో మద్యం ఏరులై పారింది. ఆయా పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు ఓటర్లను మద్యం, మాంసంతో మచ్చిక చేసుకున్నారు. ప్రచారానికి వచ్చిన వారితో పాటు ఎక్కువ మంది ఓటర్లను ఆకర్షించేందుకు మద్యం పంపిణీ చేశారు. సాధారణ రోజుల్లో సగటున ప్రతి రోజూ జిల్లా వ్యాప్తంగా రూ.60 నుంచి 80 లక్షల మద్యం అమ్ముతుంటారు. కానీ ఈ రెండు నెలల పాటు ప్రతి రోజూ జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.1.25 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఆబ్కారీ నివేదికలు చెబుతున్నాయి.

### రూ.75.28 కోట్ల అమ్మకాలు


అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మందు బాబులు తాగి ఊగారు. ఆయా పార్టీల నేతల చుట్టూ తిరుగుతూ మద్యంతో పాటు డబ్బు పొందారు. జిల్లాలో 47 మద్యం దుకాణాలు, 8 బార్ అండ్ రెస్టారెంట్‌లు ఉండగా, అమ్మకాలు జోరుగాసాగాయి. అక్టోబర్‌లో లిక్కర్ 41,967 కేసులు -53,352 కేసుల బీర్లు అమ్ముడు పోగా..అబ్కారీ శాఖకు రూ.40.72 కోట్ల ఆదాయం వచ్చింది. నవంబర్‌లో లిక్కర్ 34,438 కేసులు, 47,986 కేసుల బీర్ల అమ్మకాలు జరుగగా, రూ.34.56 కోట్ల ఆదాయం సమకూరింది.

### జిల్లాలో రూ 3.32 కోట్ల మద్యం పట్టివేత

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయా పార్టీల నేతలు ముందస్తుగానే మద్యం నిల్వలు డంప్ చేసుకున్నట్లు తెలిసింది. భైంసాతో పాటు ఇతర ప్రాంతాల్లో ముందస్తు సమాచారం మేరకు ఆ బ్కారీ అధికారులు దాడులు నిల్వ చేసిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని 19 మండలాల్లోని రెండు ఎక్సైజ్ స్టేషన్‌లో 95,736 లీటర్ల మద్యాన్ని ఆబ్కారీ అధికారులు స్వాధీనం చేసుకోగా, వీటి విలువ రూ.3.32 కోట్లు ఉంటుందని అధికారులు వెల్లడించారు.

### మద్యంతో పాటు పెరిగిన మాంసం అమ్మకాలు

జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, ముథోల్ అసెంబ్లీ ఎన్నికల్లో మద్యంతో పాటు మాంసం విక్రయాలు జోరందుకున్నాయి. చికెన్, మటన్, ఫిష్, కోడిగుడ్ల అమ్మకాలు రెండింతలు జరిగినట్లు తెలుస్తోంది. జిల్లాలో ప్రతిరోజూ సగటున రూ.20 లక్షల మాంసం విక్రయాలు జరగాల్సి ఉండగా, ఎన్నికల నేపథ్యంలో వీటి విక్రయాలు రోజుకు రూ.30 లక్షల వరకు జరిగినట్లు వ్యాపార వర్గాలు తెలిపాయి.



# యుద్ధ ప్రతిపాదికన ధాన్యం తరలింపు

నిర్మల్ టౌన్, డిసెంబర్ 7 : నిర్మల్ జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని యుద్ధప్రతిపాదికన రైస్‌మిల్లులకు తరలిస్తున్నట్లు డీఎం శ్రీకళ తెలిపారు. రెండు రోజుల నుంచి రాష్ట్రంలో తుఫాన్ కారణంగా చిరుజల్లులు కురవడం, కారుమబ్బులు కమ్ముకోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడవకుండా సిబ్బందికి సూచనలు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని లక్ష్మణచాంద, మామడ, నిర్మల్ రూరల్, తదితర మండలాల్లో ధాన్యం కేంద్రాల నుంచి ప్రత్యేక లారీల ద్వారా రైస్‌మిల్లులకు తరలిస్తున్నట్లు, రైతులు కూడా సహకరించాలని కోరారు.

# నీతి ఆయోగ్ ఆస్పిరేషన్ బ్లాకుగా తిర్యాణి

ఆసిఫాబాద్,డిసెంబర్ 7: కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నీతి ఆయోగ్ ఆస్పిరేషన్‌కు సంబంధించి దేశంలో 500 బ్లాకుల్లో తిర్యాణి ఉత్తమ బ్లాక్‌గా ఎంపికైందని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం విద్య, వైద్యం, ఐసీడీఎస్ ప్రాజెక్టు, చిన్నపిల్లలకు పోషకాహారం అందించడం, వ్యవసాయ, నీటి వసతి, నైపుణ్యత, వ్యవసాయ నీటి నిర్వహణ తదితర అంశాలపై గతంలో ఎంపికైన బ్లాక్‌లలో ప్రభుత్వం సర్వే నిర్వహించిందని, ఇందులో భాగంగా 500 బ్లాకుల్లో తిర్యాణి ఉత్తమ బ్లాక్‌గా నిలిచిందని తెలిపారు. ఇందుకు కృషిచేసిన సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ బ్లాకుగా ఎంపిక కావడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

# మేమున్నాం.. ధైర్యంగా ముందుకుసాగాలి

**- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న**

భీంపూర్, డిసెంబర్ 7: బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులకు మేమున్నామని, ధైర్యంగా ముందుకు సాగాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగురామన్న పేర్కొన్నారు. గురువారం ఆదిలాబాద్ క్యాంప్ కార్యాలయంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, భీంపూర్ మండలం కరంజి(టీ) బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా జోగురామన్న శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. కార్యకర్తలు,నాయకులు పేదలు, రైతులతో పాటు అన్ని వర్గాల సమస్యలను గమనిస్తూ ఉండాలని, అవసరమైతే పార్టీ ఆదేశాల మేరకు సమస్యలపై పోరాడాలని సూచించారు. నాయకులు జీ.నరేందర్‌యాదవ్, ఎం.కల్చాప్ యాదవ్, ఆకటి నరేందర్‌రెడ్డి,ఏనుగు అశోక్‌రెడ్డి, బక్కి సతీష్, రెడ్డి రమేశ్,శంకన్న, మాద గణేశ్, గెడాం శ్రావణ్, దేరడ్డి వామన్ తదితరులున్నారు.


బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్నను కలిసిన కరంజి నాయకులు